నా కొడుకును శిక్షించాల్సిందే

కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో దోషి తల్లి

కోల్‌కతా: ఆర్జీ కర్ వైద్య కళాశాల, దవాఖాన ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌ని శిక్షించాల్సిందేనని ఆయన తల్లి మాలతి (70) చెప్పారు. తన కుమారుడు నేరం చేసినట్లయితే, శిక్షకు, అది ఉరి శిక్ష అయినా, పాత్రుడేనని తెలిపారు. తాను ఒంటరిగా విలపిస్తానని, తన కుమారుడికి పడే శిక్షను విధి రాత అనుకుంటానని వివరించారు. తాను ముగ్గురు ఆడపిల్లల తల్లినని, ట్రైనీ డాక్టర్ కూడా తన కూతురులాంటిదేనని చెప్పారు. బాధితురాలి తల్లి అనుభవించే ఆవేదనను తాను అర్థం చేసుకోగలనన్నారు. సంజయ్ సోదరి శనివారం మాట్లాడుతూ, కోర్టు తీర్పుపై అప్పీలు చేయబోమని తెలిపారు. సంజయ్‌కి కోల్‌కతా కోర్టు సోమవారం శిక్షను ఖరారు చేస్తుంది.

గోమూత్రంలో ఔషధ గుణాలు!

ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రకటనపై వివాదం

చెన్నై, జనవరి 19: గోమూత్రంలో అద్భుతమైన ఔషధ గుణాలు ఉన్నాయని, అది తాగిన వెంటనే జ్వరం మటుమాయం అయ్యిందంటూ ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ వీజినాథన్ కామకోటి చేసిన ప్రకటనపై వివాదం చెలరేగింది. ఆయన చేసిన ప్రకటన అర్థం లేనిదని, అలాంటి వ్యక్తిని విద్యా వ్యవస్థ నుంచి బయటకు సాగనంపాలని డీఎంకే నేత టీకేఎస్ ఎలంగోవన్ డిమాండ్ చేశారు. 'అతడిని వెంటనే ఐఐటీ నుంచి తప్పించి ఎయిమ్స్ డైరెక్టర్‌గా పంపితే దానికి సరిపోతారు. ముఖ్యంగా ఆయనను ఉత్తర ప్రదేశ్ లాంటి ప్రాంతానికి పంపితే అక్కడ గోమూత్రం వైశిష్ట్యం గురించి అబద్ధాలు బాగా ప్రచారం చేయవచ్చు' అని అన్నారు. అదృష్టవశాత్తు డైరెక్టర్లు విద్యార్థులకు నేరుగా బోధన జరపరని, నిజంగా ఇలాంటి వారే పాఠాలు చెబితే విద్యార్థులకు అంతకన్నా దురదృష్టం మరోటి ఉండదని అన్నారు. ఇలాంటి వ్యక్తి విద్యావ్యవస్థకు పనికిరారని, ఆ విషయాన్ని ఆయనే రుజువు చేసుకున్నారని, అతను గుళ్లో పూజలు చేసుకోవడం మంచిదని అన్నారు. కాగా, డీఎంకే విమర్శలను బీజేపీ నేత నారాయణ తిరుపతి తీవ్రంగా ఖండించారు. గోమూత్రాన్ని ఒక పదార్థంగా వాడి కొన్ని మందులు తయారు చేస్తారని, ఇది మన దేశంలో ఎప్పటి నుంచో ఉందని, ఇది భారత సంప్రదాయ ఔషధమని పేర్కొన్నారు. ఇది తెలుసుకోకుండా డీఎంకే, కాంగ్రెస్ నేతలు పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

తల్లిదండ్రులు వదిలేద్దామనుకున్న బిడ్డ..

ఐపీఎస్ అయ్యింది!

సివిల్స్ సాధించిన అమరావతి సీఈవో సంజితా మహాపాత్ర

ముంబై, జనవరి 19: పుట్టగానే తల్లిదండ్రులు వద్దనుకున్నారు. బాల్యమంతా ఆర్థిక ఇబ్బందులు. అయినా.. చదువును అశ్రద్ధ చేయలేదు. పట్టుదల, సంకల్పంతో అన్ని అడ్డంకుల్ని అధిగమించి చివరికి తన తల్లిదండ్రులు గర్వపడేలా ఎదిగారు. ఆమె ఎవరో కాదు మహారాష్ట్రలోని ఐఏఎస్ అధికారిణి సంజితా మహాపాత్ర. ప్రస్తుతం ఆమె అమరావతి జిల్లా పరిషద్ సీఈవోగా ఉన్నారు. జిల్లాలో మహిళా సాధికారత, విద్య, వైద్య పరిస్థితుల్ని మెరుగుపర్చటంపై దృష్టి సారించారు. కొద్ది రోజుల క్రితం మీడియా సమావేశంలో తన కుటుంబ నేపథ్యం గురించి వివరించారు. ఒడిశాలోని రూర్కెలాలో ఓ పేద కుటుంబంలో పుట్టానని, మగ పిల్లాడు పుడతాడని భావించిన తన తల్లిదండ్రులకు తాను పుట్టడం తీవ్రంగా నిరాశకలిగించిందని మహాపాత్ర అన్నారు. తల్లిదండ్రులు తనను వదిలేద్దామనుకున్నారని, బాల్యంలో సామాజిక సంస్థల సహకారం, స్కాలర్‌షిప్స్‌తో చదువు పూర్తిచేశానని ఆమె చెప్పారు. మెకానికల్ డిగ్రీ చదువుకొని, భర్త సహకారంతో 5వ సారి ప్రయత్నించి యూపీఎస్‌సీకి ఎంపికయ్యానని వివరించారు.